# సాక్షి
# వికారాబాద్

ఆదివారం । 18 । మే । 2025








**నిబంధనల ప్రకారం ఎంపిక**


లబ్ధిదారుల ఎంపికను నిబంధనల ప్రకారం చేపట్టాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. 8లో▸





**పొలాలకు దారి చూపండి**

పొలాలకు వేళ్లేందుకు దారి చూపాలని మండల పరిధిలోని నాగులపల్లి రైతులు తహసీల్దార్‌ను కోరారు. 8లో▸


**రోడ్డు పక్కనే వ్యర్థజలాలు..**

ఎక్కడ పడితే అక్కడ వ్యర్థ జలాలను పారబోస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸


## న్యూస్‌రీల్

### 'బీఏఎస్'కు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతగిరి:** బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో (బీఏఎస్) 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఎస్సీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు అర్హత ఉన్న విద్యా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లోని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### వికారాబాద్‌కు ఎలక్ట్రికల్ స్టోర్

**అనంతగిరి:** టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ వికారాబాద్‌కు నూతన ఎలక్ట్రికల్ స్టోర్‌ను కేటాయించింది. శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ స్టోర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇదివరకు విద్యుత్ మరమ్మతులకు సంబంధించిన ఏదైన సామగ్రి అవసరమయితే హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేది. దీంతో మరమ్మతులు ఆలస్యమై విద్యుత్ సమస్యలు తలెత్తేవి. ఇదే విషయాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కాంట్రాక్టర్లతో కలిసి సమస్యను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి స్టోర్ కేటాయించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు ప్రసాద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ఐదెకరాల ప్రభుత్వ స్థలంలో ఈ గోడౌన్ నిర్మించనున్నారు.

### ధారూరు మార్కెట్‌కు 9,742 బస్తాల ధాన్యం

**ధారూరు:** ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 9,742 బస్తాల వరి ధాన్యం వచ్చిందని ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. ఇందులో 1010 రకం ధాన్యం 9,520 బస్తాలు రాగా క్వింటాల్‌కు రూ.1,820–రూ.2 వేల వరకు ధర పలికిందని చెప్పారు. సోనారకం వడ్లు 322 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.1,950–2,170 వరకు, మొక్కజొన్న 3,143 బస్తాలు వచ్చాయని క్వింటాల్‌కు రూ. 2,100 – రూ.2,290 వరకు ధర పలికిందన్నారు.

### కృష్ణస్వామికి 'జీవన సాఫల్యం'



గోరటి వెంకన్న చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కవి కృష్ణస్వామి

**చేవెళ్ల:** సాహిత్యంలో రాణిస్తున్న కవి దుబ్బాకుల కృష్ణస్వామి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. చేవెళ్ల మండలంలోని తల్లారం గ్రామానికి చెందిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదికల సంయుక్త ఆధ్వర్యంలో అజారామరం చరిత్రక పద్యనాటకం, అనంత ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రవీంద్రభారతిలో తనకు అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు చెప్పారు.

### స్థిర అభివృద్ధిపై దృష్టిసారించాలి

ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్



సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

**మొయినాబాద్:** స్థిరమైన అభివృద్ధి సాధనపై యువత దృష్టిసారించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. 'సుస్థిర ప్రపంచం కోసం ఔత్సాహిక, ఆవిర్కరణలు' అంశంపై చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయన్నారు. ఈమూడింటిని సమతుల్యం చేసే విధంగా అభివృద్ధి ఉండాలని ఆకాంక్షించారు. స్థిరమైన అభివృద్ధి కోసం వ్యాపారాల విస్తరణతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై ప్రజెంటేషన్లు ఇచ్చినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.జాహంగీర్, ఇంద్రజిత్ ఘోషే పాల్గొన్నారు.

# సీడ్.. ఫ్రాడ్

వచ్చేది వానాకాలం.. ఇక పంటల సీజన్ ప్రారంభం కాబోతోంది. ఏటేటా విత్తనాల ధరలతో పాటు నకిలీ విత్తనాల దందా సైతం పెరుగుతోంది. తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అంటూ వాటిని రైతులకు అంటగడతున్నారు. ఇటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.




ఇటీవల పట్టుబడిన నకిలీ విత్తనాలను చూపుతున్న పోలీసులు

**కర్ణాటక కేంద్రంగా నకిలీ విత్తనాల దందా**

- జాతీయ రహదారి మీదుగా రవాణా
- గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని రైతులకు అంటగడుతున్న అక్రమార్కులు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**కొడంగల్:** జిల్లాలో నకిలీ.. నాసిరకం విత్తనాల విక్రయాలకు కొందరు వ్యాపారులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో నిరుద్యోగులను ఏజెంట్లుగా నియమించుకుని రైతులకు ఎర వేస్తున్నారు. జూన్‌లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుండంతో ఈ దందా జోరందుకుంది.

### కల్తీ విత్తనాలకు కేరాఫ్ కర్ణాటక

కర్ణాటక రాష్ట్రం కల్తీ విత్తనాలకు వేదికగా మారింది. అక్కడి వ్యాపారులు నాసిరకం గింజలను కొనుగోలు చేసి విత్తనాల పేరిట విక్రయిస్తున్నారు. ఇందుకు నిదర్శనం రెండు మూడు రోజులుగా కొడంగల్ పోలీసులకు చిక్కిన నకిలీ విత్తనాలే. ఇప్పటికే పలు గ్రామాల్లో వీటి విక్రయాలు చేపట్టారు. బ్రాండెడ్ కంపెనీల కవర్లలో నకిలీ విత్తనాలు నింపి సీల్ వేసి అమ్మకానికి పెడుతున్నారు. దీంతో అభం శుభం తెలియని కర్షకులు వాటిని కొనుగోలు చేసి పంట దిగుబడి రాక నష్టపోతున్నారు. సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక నుంచి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి మీదుగా జిల్లాలోని పలు గ్రామాలకు నకిలీ విత్తనాలను రవాణా చేస్తున్నారు. కర్ణా టక రాష్ట్రంలోని గుర్మిట్కల్‌లో ఓ ఎరువుల వ్యాపారి ఈ నకిలీ విత్తనాల దందా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన కర్ణాటక రాష్ట్రంలోని కుష్టిగిరి జిల్లాలోని ఓ జిన్నింగ్ మిల్లు నుంచి తక్కువ ధరకు పత్తి విత్తనాలను కొనుగోలు చేసి ఆ విత్తనాలకు రంగులు కలిపి బ్రాండెడ్ కంపెనీల కవర్లలో ప్యాకింగ్ చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అతనిపై కేసులు కూడా నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని ఒక ప్యాకింగ్ కంపెనీలో బ్రాండెడ్ కంపెనీల కవర్లను కొనుగోలు చేసి ఆ కవర్లలో నాసిరకం విత్తనాలు పోసి ప్యాకెట్లుగా తయారు చేయించి ఏజెంట్ల ద్వారా విక్రయాలు సాగిస్తున్నాడు. జిల్లాలోని పలు గ్రామాలతో పాటు కొడంగల్ నియోజకవర్గంలో నకిలీ విత్తనాల విక్రయాలనికి ఏజెంట్లు ఉన్నట్లు సమాచారం.

### కేసులు పెట్టినా మారని తీరు

కొడంగల్ మండల పరిధిలోని అన్నారంలో గతంలో ఒకరి ఇంట్లో నకిలీ విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇంట్లో దొరికిన సామగ్రిని చూసి అధికారులు విస్తుపోయారు. 320 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, బ్రాండెడ్ కంపెనీల పేరుతో ఉన్న 60 ప్యాకెట్లు, వివిధ కంపెనీల పేరుతో తయారు చేయించిన 290 కవర్లు, విత్తనాలు కొలిచే డబ్బా గుర్తించిన పోలీసులు అదే రోజు నిందితులను రిమాండ్‌కు తరలించారు. వారిచ్చిన సమాచారంతో తీగలాగితే డొంక కదిలింది. సూత్రధారులు, పాత్రధారులు పోలీసులకు పట్టుబడ్డారు. కొంత కాలం తర్వాత రిమాండ్ నుంచి బయటకు వచ్చి తిరిగి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జూన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని.. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని.. రసీదులు భద్రపరుచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### ప్రత్యేక బృందాల దాడిలో..

మండల పరిధిలోని నందిగామ శివారులో ఓ రైతు పొలం దగ్గర 25 కిలోల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. సదరు రైతును విచారించగా దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినట్లు చెప్పాడు. పోలీసులు, వ్యవసాయాధికారులు అక్కడ సోదాలు నిర్వహించగా 14 క్వింటాళ్ల నాసిరకం పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. వారిని విచారించగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలోని ఒక ప్రాసెసింగ్ యూనిట్ దగ్గర కొనుగోలు చేసినట్లు తేలింది. నిందితులపై కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. ఇలాంటి ఘటనలు నియోజకవర్గంలో పెరుగుతున్నాయి. ప్రతీ ఏడాది అధికారులు దాడులు చేసినా నకిలీ విత్తనాలను అరికట్ట లేకపోతున్నారు. మూడు రోజులుగా కొడంగల్ పోలీసులకు నకిలీ విత్తనాలు, ఇతర నిత్యావసర సరుకులు పట్టుబడ్డాయి.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపిస్తాం. ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. రైతులను మోసం చేసే వారిపై నిఘా పెట్టాం. జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తున్నాం. సమాజానికి హాని కలిగించే కల్తీ, నకిలీ, నిషేధిత సరుకులను విక్రయించినా.. అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడా ఎలాంటి దొంగ దందా జరిగినా కేసులు నమోదు చేస్తామని పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ సత్యనారాయణలు హెచ్చరించారు.




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ఎస్పీ నారాయణరెడ్డి

## వానాకాలం సాగుపై సమీక్ష

- నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

**అనంతగిరి:** నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో వానాకాలం పంటల సంసిద్ధతపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల సరఫరా, లభ్యత, టాస్క్‌ఫోర్స్, అంతర్గత బృందాలు, నకిలీ విత్తనాల నిరోధన, నాణ్యతా ప్రమాణాలపై వ్యవసాయ శాఖ, పోలీస్ అధికారులతో ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎలాంటి ఒత్తిడిలకు లొంగకుండా విధులను నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 538 ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా సరిహద్దుల్లో టాస్క్ ఫోర్స్ బృందాలు నిఘా పెంచాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు ఎక్కడైనా విక్రయిస్తున్నట్లు అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వారిపై వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూరు సబ్–కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీహెచ్ఎస్ఓ సత్తార్, వ్యవసాయ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగరాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం

మంత్రి పొన్నం ప్రభాకర్

**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్‌ను దేశంలోని ఇతర నగరాలకు రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తామని, శాంతిభద్రతలు, సుందరీకరణ పనులతో పాటు ప్రజా సమస్యల్ని పరిష్కరిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, తదితర అన్ని అంశాలపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ప్రజా సమస్యలతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టాల్సిన పనుల గురించి, ఇందుకు సంబంధించి కార్యాచరణ గురించి సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకున్నట్లే, వర్షా కాలంలోనూ ప్రజలకు ముంపు సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంపై సమీక్షించినట్లు చెప్పారు. అధికారుల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యల్ని వెబ్‌పోర్టల్, మై జీహెచ్ఎంసీ యాప్ ద్వారా కూడా తెలియజేయవచ్చన్నారు.



ఓ ఇంటి వద్ద పక్షి గూడును ఏర్పాటు చేస్తున్న రజాక్



రజాక్ ఏర్పాటు చేసిన గూడులో పిచ్చుక

# స్వచ్ఛమైన సేవకులు

- పక్షుల సంరక్షణకు కృషిచేస్తున్న రజాక్
- పచ్చదనం పెంపే లక్ష్యంగా సాగుతున్న అంజయ్య

**మీర్‌పేట:** అభివృద్ధి పేరిట శివారు ప్రాంతాలు కాంక్రీట్ జంగిల్‌గా మారడం.. భారీ నిర్మాణాల కోసం ఉన్న కాస్త చెట్లను నరికివేయడంతో గూడు లేక.. ఆహారం లభించక కొన్ని పక్షి జాతులు పూర్తిగా అంతరించాయి. ఇదే దశలో ఉన్న ఊర పిచ్చుకలు, ఇతర పక్షుల సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు విశ్రాంత ఉద్యోగి, పక్షి ప్రేమికుడు.. రజాక్. మీర్‌పేటలోని ప్రశాంతిహిల్స్‌లో నివాసముండే ఆయన ఊర పిచ్చుకల సంరక్షణకు కృషిచేస్తున్నారు. ఇందు కోసం సొంతంగా తయారు చేసిన పిచ్చుక గూళ్లను ఇంటింటికీ తిరిగి తానే స్వయంగా ఏర్పాటు చేస్తున్నారు. మీర్‌పేటతో పాటు పరిసర ప్రాంతాల్లోని దాదాపు అన్ని ఇళ్ల వద్ద ఆయన ఏర్పాటు చేసిన పక్షి గూళ్లు కనిపిస్తాయి. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే పిచ్చుకలను సంరక్షించి వాటి సంఖ్యను పెంచడమే తన లక్ష్యమని చెబుతున్నాడు. వేసవి దృష్ట్యా కాలనీలోని చెట్లు, పార్కులో పక్షులతో పాటు కుక్కలు, పిల్లులు, ఉడుతలకు నీళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాలనీలో పచ్చదనంతో పాటు పూలు, పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు.



తాను నాటిన మొక్కకు నీరు అందిస్తున్న సిద్దాల అంజయ్య

సామాజిక బాధ్యతగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేందుకు కృషిచేస్తున్నారు జిల్లెలగూడకు చెందిన సిద్దాల అంజయ్య. గడిచిన ఐదేళ్లుగా రాఘవేంద్రకాలనీ, వెంకటేశ్వరనగర్ కాలనీ, గాయత్రీహోమ్స్, లలితానగర్‌లో వేలాది మొక్కలు నాటి, నిత్యం ట్యాంకర్లతో స్వయంగా నీరందిస్తున్నారు. చెట్ల సంరక్షణతో పాటు కాలనీల్లోని పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా చూస్తున్నారు. ఈయన నాటిన వేలాది మొక్కలు ప్రస్తుతం భారీ వృక్షాలుగా ఎదిగాయి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలనే ఉద్దేశంతో తనవంతు బాధ్యతగా మొక్కలను సంరక్షిస్తున్నానని అంజయ్య చెబుతున్నారు. మున్సిపాలిటీ, కాలనీలవాసుల నుంచి తనకు పూర్తి సహకారం అందుతోందని తెలిపారు.

# సన్నాలకు డిమాండ్

సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వ్యాపారులు మంచి ధర చెల్లిస్తామంటూ కల్లాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తామంటూ రైతులతో మాట్లాడుకుని ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**రైతులను ప్రసన్నం చేసుకుంటున్న వ్యాపారులు**

- పంట నూర్పిడి సమయంలోనే అడ్వాన్స్‌లు
- ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించినా మొగ్గు చూపని రైతులు



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం

**వికారాబాద్:** సన్న వడ్లకు ఓపెన్ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ కనిపిస్తోంది. సన్న రకం బియ్యానికి అధిక ధరలు ఉండడంతో వ్యాపారులు రైతుల నుంచి నేరుగా వడ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పొలాల వద్దకే వెళ్లి నూర్పిడులు చేస్తుండగానే అడ్వాన్స్ ఇచ్చేస్తున్నారు. ఈ ఏడాది సన్న వడ్ల సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే రెండింతలయింది.

**భారీగా పెరిగిన వరి సాగు**

గత నెల నుంచి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సాగు పెరిగింది. 20 శాతం వరకు రైతులు సన్నరకం సాగు చేస్తున్నారు. ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని భావిస్తున్న దళారులు పంట నూర్పడిల సమయంలోనే పొలం బాట పట్టి రైతులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు. వీటిని బహిరంగ మార్కెట్లో లేదా బియ్యంగా మార్చి విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ఐదు శాతం మించి విక్రయించడం లేదు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో సన్న వడ్లు సేకరించడం ప్రభుత్వానికి తప్పనిసరిగా మారింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అంతంత మాత్రమే వస్తుండటంతో పౌరసరఫరాల శాఖ సన్న బియ్యానికి పక్క జిల్లాలపై ఆధారపడక తప్పడం లేదు.

**ఐదు శాతం లోపే..**

జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు కాగా ఈ ఏడాది 1,30,000 ఎకరాల్లో వరి సాగు చేశారు.. ఇందులో 30 వేల ఎకరాల్లో సన్న రకం వడ్లు సాగు చేయగా రైతులకు రూ.500 బోనస్ ఇచ్చినా.. కొనుగోలు కేంద్రాలకు ఐదు శాతం మించి విక్రయించలేదు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 62 వేల ఎకరాలు కాగా 93 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో 22 వేల ఎకరాల్లో సన్నరకం వడ్లు సాగు చేశారు. ఓపెన్ మార్కెట్లో సన్నబియ్యం అధిక ధరలకు అమ్ముడు పోతుండటంతో రైతుకు మంచి లాభాలు వస్తున్నాయి. ఐనప్పటికీ కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యంలో ఐదు శాతం లోపే సన్నరకాలు వస్తున్నాయి. జిల్లాలో 85 కొనుగోలు కేంద్రాల ద్వారా 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా సన్నరకం ధాన్యం 900 మెట్రిక్ టన్నుల మాత్రమే వచ్చాయి.

**సన్న రకం మొత్తం ధాన్యం సేకరిస్తే...?**

జిల్లాలో మొత్తం 2,48,475 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ లబ్ధిదారులకు ప్రతీ నెల రేషన్ కార్డుల ద్వారా బియ్యం సరఫరా చేయటానికి 5,782 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఈ లెక్కన ఏడాదికి 69,384మెట్రిక్ టన్నుల బియ్యం కావాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ జిల్లాలో 30 వేల ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేయగా యాసంగిలో మరో 22 వేల ఎకరాలు సాగు చేశారు. దీంతో రెండు సీజన్లలో జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకం వచ్చే అవకాశం ఉంది. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తే 60 నుంచి 65 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సమకూరే అవకాశం ఉంది. ఈ లెక్కన జిల్లాలో రైతులు పండించిన సన్న రకం మొత్తం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తే కొంచ అటూ ఇటుగా జిల్లాకు ఏడాది సరిపడ సన్నబియ్యం సమకూరుతాయి. కానీ రైతులు ఎక్కువగా బయటనే విక్రయిస్తుండటంతో జిల్లాకు కావాల్సిన సన్నబియ్యం కోసం పక్క జిల్లాలపై ఆధారపడక తప్పడంలేదు.

## ప్రభుత్వ భూముల జోలికొస్తే ఉపేక్షించం



హెచ్చరిక బోర్డులు నాటిన రెవెన్యూ సిబ్బంది

- అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి
- బాటసింగారంలో రూ.18 కోట్ల విలువైన భూమికి హద్దుల నిర్ధారణ
- హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

**అబ్దుల్లాపూర్‌మెట్:** ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిని ఉపేక్షించేది లేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని బాటసింగారం సర్వేనంబర్ 10/95, 10/96లోని మూడెకరాల ప్రభుత్వ భూమిని సర్వేయర్ జ్యోతి, ఆర్ఐ ఇందిరరాణితో కలిసి శనివారం సర్వే చేయించారు. హద్దులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హెచ్చరిక బోర్డులు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించామని తెలిపారు. వీరు నిత్యం నిఘా పెడుతారన్నారు. బోర్డు పాతిన ప్రభుత్వ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.18 కోట్లు ఉంటుందని తెలిపారు. దీనికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన నాలుగు నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయించామన్నారు.

## చెట్ల పొదల్లో మృతదేహం

కడియాలకుంట తండా సమీపంలో ఆలస్యంగా వెలుగులోకి..

**షాద్‌నగర్ రూరల్:** రైలునుంచి జారిపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కడియాకుంట తండా సమీపంలో ఆలస్యంగా వెలుగు చూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు నుంచి జారి పట్టాల సమీపంలోని చెట్ల పొదల్లో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. చెట్ల పొదల్లోనుంచి దుర్వాసన వస్తుండటంతో గమనించిన స్థానికులకు శవం కనిపించింది. ఈ విషయమై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే ప్రయత్నం చేశారు. కానీ మృతుడి ఆచూకీ తెలియరాలేదు. మూడు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. నీలి రంగు జీన్స్ ప్యాంటు, నలుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే 9848090426 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు సూచించారు. మహబూబ్‌నగర్ స్టేషన్ మాస్టర్ విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### హకీంపేట్‌లో మొబైల్ ఏటీఎం సేవలు



తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట మొబైల్ ఏటీఎం వాహనం

**దుద్యాల్:** హకీంపేట్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు మొబైల్ ఏటీఎం సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందుబాటులో ఉండడంతో అక్కడ ఏటీఎం లేకపోవడంతో నగదు విత్‌డ్రాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, ఇబ్బందులను తొలగించేందుకు మొబైల్ ఏటీఎం సేవలు అందుబాటులోకి తెచ్చారు.

### డీజే ఏర్పాటు చేసిన ముగ్గురిపై కేసు

పట్టణ సీఐ సంతోశ్ కుమార్

**తాండూరు టౌన్:** డీజె సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యానికి కారుకులైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు పట్టణ సీఐ సంతోశ్ కుమార్ శనివారం తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలోని సాయిపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా డీజె సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసిన కుర్వ ఎల్లప్ప, సౌండ్ సిస్టమ్ యజమాని కుర్వ జగదీశ్, ఆపరేటర్ బుగడజంగం ఆదర్శ్‌లపై కేసు నమోదు చేశామన్నారు. నిబంధనల ప్రకారం నివాస ప్రాంతాల్లో పగలు 55 డెసిబుల్స్, రాత్రి 45 డెసిబుల్స్ శబ్దం వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజె సౌండ్ సిస్టమ్ వల్ల సుమారు 150 డెసిబుల్స్ శబ్దం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలతో పాటు గుండె పోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. కావున శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజెలకు అనుమతులు లేవన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

### సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ గఫార్

**బంట్వారం:** కోట్‌పల్లి మండలంలో ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బి.రాములు గత నెల 14వ తేదీన తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించారు. శనివారం బాధితుడికి ఫోన్ అప్పగించినట్లు ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ తెలిపారు.

### అకాల వర్షం

**తాండూరు రూరల్:** పెద్దేముల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి అకాల వర్షం కురిసింది. తట్టేపల్లి ప్రాంతంలోని అడికిచెర్ల, ఎర్రగడ్డతండా, సిద్దన్నమడుగు తండా, ఇందూర్, బండమీదిపల్లితో పాటు పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

### సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి


ట్రైనీ ఎస్‌ఐ విఠల్

**దుద్యాల్:** ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ ఎస్‌ఐ విఠల్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రధాన చౌరస్తాలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు, గ్రామ యువకులకు ప్రమదాలపై జాగ్రత్తలు వివరించారు. వాహనాలను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయల్ 100, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముక్తా రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ‘ఆపరేషన్’ అమ్మ!

ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న పలు ప్రైవేటు ఆస్పత్రులు, కొంతమంది వైద్యులు అవసరం లేకపోయినా సిజేరియన్ చేస్తున్నారు. ప్రసవం కోసం దవాఖానాల్లో చేరిన గర్భిణులతో పాటు వారి కుటుంబ సభ్యులను భయపెట్టి ఆపరేషన్లు చేస్తున్నారు. ఇందుకు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బుల కోసం ‘కడుపు కోతలు’

- అవసరం లేకపోయినా సిజేరియన్లు
- శుభ ముహూర్తం కోసం కొందరు..
- పురిటి నొప్పులకు భయపడి మరికొందరు
- సహజ ప్రసవాలతో పోలిస్తే పెరిగిన శస్త్రచికిత్సలు

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** పురిటి నొప్పుల బాధ తెలియకుండా మంచి ముహూర్తంలో బిడ్డకు జన్మనివ్వాలనే భావన ఒకవైపు.. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తాన్ని సంపాదించాలనే ఆశ మరో వైపు.. వెరసి అమ్మ కడుపుపై కత్తిగాట్లు పడుతున్నాయి. ఎలాంటి కోతలకు అవకాశం లేకుండా సహజ సిద్ధంగా పండంటి బిడ్డను ప్రసవించే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రసవాలపై గర్భిణులు, వారి కుటుం బంధువుల్లో ఉన్న బలహీనతను కొంత మంది వైద్యులు అవకాశంగా తీసుకుంటున్నారు. పురిటి నొప్పులతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుకుంటున్న వారిని భయాందోళనలకు గురిచేస్తూ.. అవసరం లేకపోయినా సిజేరియన్లను ప్రోత్సహిస్తున్నారు. చికిత్సల పేరుతో వారి నుంచి అధిక మొత్తంలో ఫీజు లాగుతున్నారు. సాధారణంగా సహజ ప్రసవానికి రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుంది. అదే సిజేరియన్‌కు ఐదు నుంచి పది నిమిషాలకు మించదు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రసవాలు చేయాలనే ధోరణితో కొంత మంది వైద్యులు శస్త్రచికిత్సల వైపు మొగ్గు చూపుతున్నారు. సహజ ప్రసవానికి రూ.25 నుంచి రూ.30 వేలకు మించి ఫీజు రాదు. అదే ఆపరేషన్ చేస్తే ఆస్పత్రిని బట్టి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు**

| సంవత్సరం | సహజ | సిజేరియన్లు |
|---|---|---|
| 2020–2021 | 13,543 | 8,062 |
| 2021–2022 | 13,990 | 9,556 |
| 2022–2023 | 15,094 | 9,583 |
| 2023–2024 | 14,304 | 9,936 |
| 2024–2025 | 12,495 | 9,607 |

**ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు**

| సంవత్సరం | సహజ | సిజేరియన్లు |
|---|---|---|
| 2020–2021 | 6,031 | 13,362 |
| 2021–2022 | 5,361 | 13,941 |
| 2022–2023 | 5,094 | 13,052 |
| 2023–2024 | 4,706 | 11,815 |
| 2024–2025 | 5,833 | 12,218 |

### అధిక ఫీజులే లక్ష్యంగా..

- ప్రభుత్వ ఆస్పత్రులతో పోలిస్తే.. ప్రైవేటు ఆస్పత్రుల్లోనే సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి.
- జిల్లాలోని వివిధ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, గైనకాలజీ సెంటర్లలో ఏటా 19 వేలకుపైగా ప్రసవాలు నమోదవుతున్నట్లు సమాచారం. వీటిలో అత్యధికంగా సిజేరియన్లే కావడం ఆందోళన కలిగించే అంశం.
- ఉమ్మనీరు తగ్గిందని, తల్లికి రక్తం లేదని, కడుపులోని శిశువు బరువు పెరుగుతోందని, బిడ్డ అడ్డం తిరిగిందని ఇలా లేనిపోని భయాలను సృష్టించి, సొమ్ము చేసుకుంటున్నారు.
- నెలలు నిండక ముందే కడుపులోని బిడ్డను బయటికి తీయడం వల్ల పుట్టిన బిడ్డకు శారీరక లోపాలతో పాటు శ్వాస సంబంధ సమస్యలు తలెత్తుతున్నాయి.
- ఆపరేషన్ల కారణంగా కొంతమంది బాలింతలు అధిక రక్తస్రావంతో మృత్యువాత పడుతున్నారు.
- సర్జరీ సమయంలో వైద్యులు కడుపుపై చేసిన కత్తిగాట్లు త్వరగా మానకపోవడం, తరచూ ఇన్ఫెక్షన్లు తలెత్తుతుండటం అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది.
- చికిత్సల పేరుతో రోజుల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆఫీసు, ఇతర పనులు మానుకుని ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. దీంతో అనారోగ్యం, అధిక బరువు సమస్యలు వెంటాడుతున్నాయి.

### చర్యలు తప్పవు



ప్రసవాలపై దంపతులు, వారి కుటుంబ సభ్యుల ఆలోచనలో మార్పు రావాలి. శుభ ముహూర్తాలు వంటివి పక్కన పెట్టి, నెలలు నిండిన తర్వాత సహజ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరం లేకపోయినా ఆపరేషన్లు చేసే వైద్యులను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న సిజేరియన్లపై ఓ కన్నేసి ఉంచాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

# కుక్కల దాడిలో జింక మృతి

**పూడూరు:** కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన దామగుండం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పశువుల కాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. దామగుండం అటవీ ప్రాంతంలో శనివారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. తరచూ అటవీలోని జింకలు వేటగాళ్లు, కుక్కల దాడిలో మృత్యువాత పడుతున్నా సంబంధిత అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పదుల సంఖ్యల్లో జింకలు మృత్యువాత పడుతున్నాయని వాటిని రక్షించేలా చర్యలు తీసుకోవాలని సత్యానందస్వామి అధికారులను కోరారు. మృతి చెందిన జింకకు పోస్టు మార్టం నిర్వహించి అనంతగిరిలో ఖననం చేసినట్లు ఫారెస్టు అధికారి అరుణ తెలిపారు.



జింక కళేబరం

# ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

**ఇద్దరు కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు**

**బంజారాహిల్స్:** ప్రభుత్వ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును తొలగిస్తూ..బ్లూ షీట్లపై రాసిన గవర్నమెంట్ ల్యాండ్ అనే అక్షరాలను తుడిపేస్తూ కబ్జా యత్నానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ట్రిస్పాస్ కేసు నమోదు చేయాల్సిందిగా షేక్‌పేట మండల తహశీల్దార్ వై.అనితారెడ్డి శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా తట్టిఖానా వాటర్ రిజర్వాయర్‌ను ఆనుకుని మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. గత కొన్నేళ్లుగా పార్థసారధి, ఆయన కుమారుడు విజయ భార్గవన్ ఇద్దరూ కలిసి ఈ స్థలంలో తిష్ట వేశారు. ఓ గదిని నిర్మించడమే కాకుండా రౌడీలను ఏర్పాటుచేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అధికారుల కదలికలపై దృష్టిపెట్టి అక్రమంగా స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వీరిద్దరిపై ఇప్పటికే షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు రెండుసార్లు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రెండుసార్లు ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. అయినా సరే వీరు ఏమాత్రం పట్టించుకోకుండా తిరిగి అదే స్థలంలో పాగా వేశారు. దీంతో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది ఈ స్థలంలోకి వెళ్లి 12 సీసీ కెమెరాలు తొలగించి చుట్టూ గవర్నమెంట్ ల్యాండ్ అనే అక్షరాలు రాసి గేటుకు తాళం వేశారు. శనివారం తెల్లవారుజామున మళ్లీ వీరు ఈ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు తొలగించారో అక్కడే కొత్తవి ఏర్పాటుచేసినట్లు అధికారులు గుర్తించారు. గవర్నమెంట్ ల్యాండ్ అక్షరాలు తుడిపేసినట్లుగా రెవెన్యూ సిబ్బంది గమనించారు. ఎన్నిసార్లు కేసులు నమోదు చేసినా, ఫిర్యాదు చేసినా, హెచ్చరించినా, సీసీ కెమెరాలు తొలగించినా, తాళాలు వేసినప్పటికీ కబ్జాదారులు ఏమాత్రం పట్టించుకోకుండా తాళాలు పగులగొట్టి రెవెన్యూ అధికారులకే సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే తహశీల్దార్ మరోసారి వీరిద్దరిపై కేసు నమోదు చేయాల్సిందిగా ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

# సోషల్ మీడియాలో వేధింపులు

**నిందితుడికి రిమాండ్**

**సాక్షి, సిటీబ్యూరో:** సామాజిక మాధ్యమాల నకిలీ అకౌంట్లు సృష్టించి, అమాయకులను మోసం చేస్తున్న సైబర్ నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన కూన ధర్మారావు దిల్‌సుఖ్‌నగర్‌లోని బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, వెబ్‌సైట్లు నిర్వహిస్తూ అమాయకులను మోసం చేయడం ఇతని ప్రవృత్తి. ఈక్రమంలో యూట్యూబ్‌లో ఆన్‌లైన్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితురాలికి నకిలీ ఇన్‌స్టాగామ్, వాట్సాప్ ఖాతాల ద్వారా ధర్మారావు సంప్రదించాడు. ఆమె ఉత్పత్తులను కొనేందుకు ఆసక్తి ఉందని, కాకపోతే తాను ఒకసారి కలవాలనుకుంటున్నానని ఆమెకు తెలిపాడు. అతని ప్రతిపాదనకు బాధితురాలు నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురైన నిందితుడు అసభ్యపదజాలంతో ఆమెకు సామాజిక మాధ్యమాలలో సందేశాలు, పోస్టులు పంపించాడు. దీంతో ఆమె ఆన్‌లైన్ వ్యాపారం దెబ్బతింది. ఈమేరకు బాధితురాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు ధర్మారావును అరెస్టు చేశారు. అతని నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, డెబిట్‌కార్డులు తదితర ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

### మద్యం మత్తులో భార్యతో గొడవపడి...

**ఉప్పల్:** మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ ఠాణా పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఎద్దుల కిషోర్ (36) భార్య గౌతమితో పాటు బీరప్పగడ్డ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. కిషోర్ వృత్తి రీత్యా డ్రైవర్. కొన్నాళ్లుగా మద్యానికి బానిసై భార్యతో గొడవలు పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తాగి వచ్చి భార్యతో గొడవ పడటంతో ఆమె కిషోర్ సోదరుడి ఇంటికి పిల్లల్ని తీసుకొని వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో భార్యకు ఫోన్ చేసి ‘నేను చచ్చిపోతున్నా’ అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఈ లోపు కిషోర్ సోదరుడు ఏసోబు, భార్య గౌతమి వెంటనే అక్కడికి చేరుకున్నారు. తలుపులు తీయక పోవడంతో బద్దలు కొట్టి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మలక్‌పేటలో భారీ చోరీ

**చాదర్‌ఘాట్:** చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మలక్‌పేట భారీ చోరీ జరిగింది. సుమారు 67.65 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురయ్యాయి. చాదర్‌ఘాట్ పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. ప్రైవేట్ జాబ్ చేస్తున్న మహమ్మద్ ఫహీముద్దీన్ చాదర్‌ఘాట్ అజంపురా వెయింగ్ బ్రిడ్జ్ సమీపంలో నివసిస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతని తమ్ముడు ఖాజా మెయినుద్దీన్, అతని భార్య మరియం ఫాతిమా వారి నివాసంలో పడిపోవటంతో అబిడ్స్‌లోని ఓ హాస్పిటల్‌లో చేర్పించారు. వారిని చూసేందుకు ఫహీముద్దీన్ భార్య ఆస్పత్రికి వెళ్ల గా, శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కుమార్తెతో కలిసి భోజనం చేసి ఫహీముద్దీన్ నిద్ర కు ఉపక్రమించారు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంటి కిచెన్ విండో ద్వారా చొరబడి బీరువాలోని బంగారు ఆభరణాలు, నగదు, ఇతర వస్తువులను దొంగిలించా డు. ఉదయం 4 గంటలకు నిద్రలేచిన ఫహీముద్దీన్ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అల్మారాలో ఉన్న 67.65 తులాల బంగారు ఆభరణాలతో పాటు మొబైల్ ఫోన్, రాడో వాచ్, వీడియో కెమెరా, కొంత నగదు చోరీకి గురైనట్లు పేర్కొన్నాడు. కాగా మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్, ఎస్‌ఐలు తిరుపతి, భరత్‌లు తమ సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ క్లూస్ టీంలతో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# ఎంపిక నిబంధనల ప్రకారం చేయండి

**మెప్మా పీడీ రవికుమార్**




మాట్లాడుతున్న రవికుమార్

**తాండూరు టౌన్:** మైనార్టీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేయనున్న కుట్టు మిషన్ల లబ్ధిదారుల ఎంపికను నిబంధనల ప్రకారం చేయాలని మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మైనార్టీల జనాభానుసరించి 79 కుట్టుమిషన్లు మంజూరయ్యాయన్నారు. వీటి కోసం పకడ్బందీగా ఎంపిక చేసి ఈ నెల 20వ తేదీ లోగా డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు, రూ.2లక్షల లోపు ఆదాయం, 18 నుంచి 55 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారే అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రాజేంద్ర ప్రసాద్, కో ఆర్డినేటర్ విశాలి, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

**పకడ్బందీగా చేపట్టాలి**

లబ్ధిదారుల ఎంపికను పకడ్బందీగా చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికతో పాటు సోషల్ ఎకనామికల్ సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో సిబిల్ స్కోర్ ప్రక్రియను ఈ నెల 19వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. వేసవిలో వార్డుల పరిధిలో తాగునీటి సమస్య, పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగులపల్లి రైతులు

### పొలాలకు దారి చూపండి

**తహసీల్దార్‌ను కోరిన నాగులపల్లి రైతులు**

**తాండూరు రూరల్:** పొలాలకు వేళ్లేందుకు దారి చూపాలని మండల పరిధిలోని నాగులపల్లి రైతులు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం పెద్దేముల్ తహసీల్దార్ వెంకట్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నాగుపల్లి శివారులో కొడుగంటి రాములు, సాయిని నాగిరెడ్డి పొలాల మధ్య కొన్నేళ్లుగా పానాది ఉందని.. దీనికి లావాణి పట్టా సైతం ఉందన్నారు. వర్షాకాలం వస్తే పొలాలకు వేళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తహసీల్దార్‌కు వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పానాది నుంచి రైతుల పొలాలకు వేళ్లేందుకు బాట చూపాలని కోరారు. ఇందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు మహిపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, నారాయణ, రాములు, నర్సింలు, రాఘవేందర్‌రెడ్డి, ముకుంద్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, అంజిలప్ప, అశోక్ తదితరులున్నారు.

# కీలక అడుగులు!

### మూసీ పునరుజ్జీవానికి మూడంచెల ప్రణాళిక

- తొలి దశలో నదీ గర్భంలో నిర్మాణాల తొలగింపు
- రెండో దశలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల నిర్ధారణ
- మూడో దశలో ప్రైవేట్ స్థలాల సేకరణకు నిర్ణయం



**సాక్షి, సిటీబ్యూరో:** మూసీ పునరుజ్జీవానికి కీలక అడుగులు పడ్డాయి. మూడంచెల్లో మూసీ సుందరీకరణ చేపట్టాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు నిర్ణయించారు. తొలుత మూసీ నదీగర్భంలోని నిర్మాణాలను తొలగించనున్నారు. అనంతరం రెండో దశలో మూసీ ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లను నిర్ధారించనున్నారు. ఇక మూడో దశలో మూసీ సుందరీకరణకు అవసరమైన భూములను సేకరించనున్నారు.

**ఆక్రమణదారులతో సమావేశం..**

నదీ గర్భంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు తొలుత ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో పాటు రెవెన్యూ, పోలీసు, బల్దియా అధికారులు సంయుక్తంగా ఆక్రమణదారులతో మాట్లాడనున్నారు. వీరందరికీ ఇప్పటికే సిద్ధంగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేయడంతో త్వరలోనే ఆయా కార్యాచరణకు అధికారులకు సిద్ధంకానున్నారు.

**స్థలాల సేకరణ..**

- అధికారిక లెక్కల ప్రకారం మూసీ గర్భంలోనే రెండు వేల అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఏళ్లుగా ఉంటున్న పేదలను ఖాళీ చేయిస్తే విమర్శలు వచ్చే అవకాశం ఉందన్న ఉద్దేశంతో నదీ గర్భంలో ఇక్కడి నివాసితులతో అధికారులు మాట్లాడనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయించారు.
- మొదటి దశలో నది గర్భంలో నిర్మించిన భవనాలను తొలగిస్తారు. రెండో దశలో నదీ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల హద్దులను నిర్ణయిస్తారు. దీంతో మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలకు తావు ఉండదు. అలాగే మూసీలోకి మురుగు నీరు చేరకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటారు. అనంతరం మూడో దశలో మూసీ సుందరీకరణకు అవసరమైన స్థలాలను సేకరిస్తారు.

# నంబర్ ప్లేట్ లేని వాహనాలపై కొరడా

- మూడు రోజులు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన వెస్ట్ జోన్ పోలీసులు
- 880 వాహనాల స్వాధీనం

**బంజారాహిల్స్:** నెంబర్ ప్లేట్ లేకుండా, సరైన నెంబర్ ప్లేట్ పెట్టుకోకుండా వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు లేకుండా తిరుగుతున్న వాహనదారులపై వెస్ట్‌జోన్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 14 నుంచి మే 16వ తేదీ వరకు వెస్ట్‌జోన్ పరిధిలో నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 880 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 108 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో ఉన్నాయి. మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 63, జూబ్లీ హిల్స్‌లో 156, ఫిలింనగర్‌లో 155, పంజగుట్టలో 102, మధురానగర్‌లో 120, ఎస్‌ఆర్‌నగర్‌లో 99, బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో 86 వాహనాలను సీజ్ చేశారు. వీరందరూ సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ధృవపత్రాలు తీసుకొని వచ్చి కోర్టులో జరిమానా చెల్లించిన తర్వాతనే పోలీస్ స్టేషన్‌లో సదరు వాహనానికి నెంబర్ ప్లేట్ బిగించిన తర్వాత వాటిని విడుదల చేస్తున్నారు. చాలా మంది నెంబర్ ప్లేట్ లేకుండా, మరికొంత మంది నెంబర్లు కనిపించకుండా ఛలానాల నుంచి తప్పించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.

# పాత కక్షలతోనే అయాన్ ఖురేషీ హత్య

**నలుగురు నిందితులకు రిమాండ్**

**నాంపల్లి:** రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఎదుట జరిగిన హత్య కేసును నాంపల్లి శాంతిభద్రతల పోలీసులు ఎట్టకేలకు చేధించారు. పాత బస్తీ హఫీజ్ బాబా నగర్‌కు చెందిన 21 ఏళ్ల అయాన్ ఖురేషీని మే 15న ప్రత్యర్థులు పాత కక్షల కారణంగా అత్యంత కిరాతకంగా కత్తులతో నరికి చంపిన విషయం తెలిసిందే. అయాన్ ఖురేషీని చంపిన నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేశారు. హత్యకు పాల్పడిన వారిలో సయ్యద్ మహమూద్ ఖాద్రి అలియాస్ ఉస్మాన్ ఖాద్రీ అలియాస్ ముజఫర్, మహ్మద్ అస్లాం, ఎండీ సిద్దిఖ్ అహ్మద్, సయ్యద్ మాజిద్ ఖాద్రి అలియాస్ మతీన్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు నలుగురిని ఒక పక్కా సమాచారంతో పట్టుకున్నారు. మధ్య మండలం డీసీపీ శిల్పవల్లి ఆదేశాలతో సైఫాబాద్ ఏసీపీ ఆర్.సంజయ్ కుమార్ నాంపల్లి ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరెడ్డితో కలిసి హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అయాన్ ఖురేషీ సోదరి నిందితుల్లో ఒకరి తమ్ముడిని 2016లో వివాహం చేసుకుంది. అయితే కుటుంబ కలహాల కారణంగా ఖురేషీ, అతడి కుటుంబ సభ్యులు 2020లో ఒక హత్య కేసులో ఇరుక్కున్నారు. అప్పటి నుండి నిందితులు పగ పెంచుకున్నారు. అదును కోసం వేచి చూసి..మే 15న నాంపల్లిలోని జువైనల్ కోర్టులో విచారణకు హాజరైన అయాన్ ఖురేషీని హత్య చేసేందుకు నిందితులు కుట్ర పన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఎదుట క్రికెట్ బ్యాట్, కత్తులతో దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ కేసుకు సంబంధించి రెండు కత్తులు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ ఆర్.సంజయ్ కుమార్ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.